క్లుప్తంగా

రామప్ప దేవాలయంలో పౌర్ణమి పూజలు

మాచర్ల రూరల్: పరశురాముడు ప్రతిష్ఠించిన రామప్ప దేవాలయంలో పూజలు నిర్వహించుకోవడం ఆ దేవుడిచ్చిన గొప్ప వరమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రామప్ప దేవాలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన మాట్లాడారు. మన దేవాలయాలు చరిత్ర కలిగిన సంస్కృతికి, సాంప్రదాయాలకు నెలవన్నారు. ఈ సందర్భంగా పురోహితులు గోవు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించి లక్ష్మీ, గణపతి, గాయత్రి, మహాలక్ష్మి హోమాలను నిర్వహించారు. స్వామి వారికి బ్రహ్మారెడ్డి ఆయన సతీమణి శోభారాణి పట్టు వస్త్రాలు, బంగారు మంగళ సూత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిటీ సభ్యులు కంభంపాటి యలమంద, పోలిశెట్టి చంద్రం, వెంకటరత్నం, ప్రకాష్, తుమ్మేపల్లి పెద అంకారావు, అంకేశ్వరరావు, సత్యనారాయణ, అరవింద్, సాంబశివరావు, కమీషనర్ వేణుబాబులు పాల్గొనగా అర్చకులు బత్తినపాటి నారాయణ మూర్తి, తులసీరాం శర్మ, బత్తినపాటి భరణిలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

దాచేపల్లి : అనుమానాస్పదంగా వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు దాచేపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ షేక్ ఖాజవలి శనివారం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడి ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ము రవీంద్ర(40)కి భార్య విజయమ్మ, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్న మరో వివాహిత మహిళతో రవీంద్రకి వివాహేతర సంబంధం ఉంది. శుక్రవారం రాత్రి ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న సంబంధిత మహిళ వద్దకి రవీంద్ర వెళ్లారు. రాత్రి 11గంటల సమయంలో రవీంద్ర వెనుక గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా సదరు మహిళ గుర్తించి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి హుటాహుటిన రవీంద్రని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య విజయమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఖాజవలి తెలిపారు. మృతుడు రవీంద్ర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

14న వీఆర్ఓల సంఘ సమావేశం

మాచర్ల రూరల్: గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, అలాగే వారికి రావాల్సిన పదోన్నతులు, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల విషయాలపై ఈ సమావేశంలో చర్చించనున్నామని చెప్పారు. ఈ సమావేశానికి వీఆర్ఓల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవింద్రరాజు, కార్యదర్శి అప్పలనాయుడు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి రఘునాథబాబు ఉన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి 21వరకు గడువు

నకరికల్లు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మి శనివారం తెలిపారు. అనాథలు, బడి బయటి పిల్లలు, డ్రాపౌట్ విద్యార్థులు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకోబడతాయని అన్నారు. వివరాలకు 70751 59996, 70750 39990 ఫోను నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వాగులో మృతదేహం లభ్యం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం, దూళ్ళిపాళ్ల గ్రామ సమీపంలోని వాగులోని గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అతడిని సత్తెనపల్లి వాసిగా గుర్తించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో నివసిస్తున్న దాసరి సాంబశివరావుగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు, దాసరి సాంబశివరావు తెనాలి కావడంతో ఇల్లరికంలో భాగంగా సత్తెనపల్లిలో నివసిస్తున్నాడు. శనివారం కుటుంబ సభ్యులు సత్తెనపల్లి రూరల్ పోలీసులను సందర్శించి మృతుడి ఆనవాళ్లు తెలిపి దాసరి సాంబశివరావుగా తెలిపారు. కాగా సాంబశివరావు చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదశాత్తు పడి మృతి చెందాడా? లేక మరేదైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం

శావల్యాపురం: స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో నూతనంగా ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినట్లు శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజరు వలేటి శివకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ కేంద్రంలో అడ్రస్ మార్పులు, చేర్పులు, నూతన ఆధార్ నమోదు తదితర సేవలను అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈసేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెంటరు ప్రతినిధి పొట్ల హనుమంతరావు కోరారు.

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మాచర్ల రూరల్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో మాచర్ల జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక కృష్ణవేణి జూనియర్ కళాశాలలో షేక్ షమీర్ 980, ఉప్పు రూప 955, ఎజ్జల సౌమ్య 953, టి. థెరిస్సా 941, షేక్ మొహతాజ్ 909, షేక్ నాగుల్ మీదా, 881 మార్కులు, ప్రథమ సంవత్సరంలో 461 మార్కులతో షేక్ షాజియా, కనకమహాలక్ష్మి 455 మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ వై.వెంకట్రామయ్య తెలిపారు.
ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పల్నాడు జూనియర్ కళాశాల విద్యార్థులు డివిజన్‌లోనే ప్రథమ స్థానాన్ని సాధించారని కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో మనుపల్లి భానుమతి 987, రాచూరి జలీల్ 977, రాళ్లపల్లి స్వాతి 976, ప్రతిభా జూనియర్ కళాశాల విద్యార్థి సయ్యద నజియా ఫర్విన్ 968, సాహితి 965, ప్రవీణ్ 965, జూనియర్ ఇంటర్‌లో కె.దుర్గా తిరుమలరావు 464, తిర్లిక విశ్వచైతన్య 461, రాచమడుగు సుహశ్రీ 460, కె.అనంత లక్ష్మి నిహిత్ 458, శ్రీలక్ష్మీ 453, మొత్తం 15 మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులు సాధించారన్నారు. ఉత్తీర్ణత లో 100 శాతం విజయం సాధనలో కృషి చేసిన చైర్మన్ ఎం లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ నూతలపాటి శివభాస్కర్, మర్రి వెంకట నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.




షేక్ నజ్మా


బి. సౌమ్య


టి. మౌనికరెడ్డి

'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ

దాచేపల్లి : ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటరని ప్రిన్సిపల్ ఎస్.రవికుమార్ శనివారం తెలిపారు. షేక్ నజ్మా 980, బి. సౌమ్య 960, టీ. మౌనికరెడ్డి 964 మార్కులు సాధించారని, 91శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

మిరియాలలో ఘనంగా ఆవు దేవర తిరునాళ్ల

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో శనివారం ఆవు దేవర తిరునాళ్ల వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి ఆవు దేవరకు గ్రామంలోని రైతులు తమ ఎడ్లతో కోడెలు, ఆవులతో తరలి వచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆవు దేవరకు మొక్కారు. తిరునాళ్లకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీసమేతంగా హాజరై ఆవుదేవర గుడిలో ఆవు దేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామస్తులు విద్యుత్తు ప్రభలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలకు అన్నదానం కార్యక్రమాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. అర్ధ రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగింది. ఇదిలా ఉంటే తిరునాళ్లకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పన్ను వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పన్ను వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని, పన్ను వసూళ్లలో ప్రతిభ చూపిన ఉద్యోగులను సన్మానించుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్లలో ప్రతిభ కనపరిచిన రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్ ఖాదర్, గిరిబాబులను మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం సన్మానించారు. వీరితో పాటుగా పన్ను వసూళ్లలో చక్కటి ప్రతిభ కనపరిచిన ఆరుగురు సచివాలయ అడ్మిన్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ రఫాని మాట్లాడుతూ సమిష్టి కృషితో రెవెన్యూ సిబ్బంది అత్యధిక వసూళ్లు సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఎస్ హరికృష్ణ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా వసూళ్లు కాని మొండి బకాయిలను రెవెన్యూ సిబ్బంది వసూలు చేయడం అభినందనీయమన్నారు. ప్రణాళిక బద్ధంగా మొండి బకాయిలు వసూలు చేయడంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ. 4.5 కోట్లు అదనంగా ఆస్తి పన్ను వసూలు చేయడం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


రెవెన్యూ అధికారికి మెమెంటో అందజేస్తున్న చైర్మన్ రఫాని, మున్సిపల్ ఆర్డీ ఎస్ హరికృష్ణ

ఆ.. అధికారులపై చర్యలు తీసుకోండి

కత్తవ చెరువు, వాగు ఆక్రమణలపై పీడీఎం నాయకుల డిమాండ్

నరసరావుపేట: కత్తవ చెరువు, వాగు ఆక్రమణల తొలగింపులో తమకు సంబంధం లేదని, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తప్పుకుంటున్న మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని, ఆక్రమణలు తొలగించి ప్రజలు ముంపుకి లోను కాకుండా చర్యలు తీసుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు కోరారు. శనివారం కత్తవ చెరువు సమీపంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా ఏదైనా కట్టుబడి జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారి అక్కడికి వెళ్ళటం, పరిశీలించటం పరిపాటని అన్నారు. వాగు చెరువు ఆక్రమణలపై మీడియా వాళ్ళు మాట్లాడితే ఒకసారి ప్రైవేట్ భూమి అని, మరోసారి విచారిస్తున్నామని, చివరికి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు తేల్చాలని ప్రకటించారన్నారు. కత్తవ చెరువు కాలువ, భూమి ఆక్రమించి ఎన్నడూ లేని పద్ధతులలో ఒకవైపు కట్టుబడి జరుగుతుంటే, మరోవైపు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల తెలియజేశామని దాటవేయటం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు.
వీరి వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. నెల రోజుల క్రితం గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చిన సందర్భంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ చెప్పి న ఇప్పటివరకు చర్యలు లేవని, అసలు కారణం ఏమిటో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకృష్ణ

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు కోనసీమ ముమ్మడివరంకు చెందిన దూమా నాగమణి (31) రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ కుమార్తె, కుమారుడితో కలిసి మంగళగిరిలో తన సోదరి ఇంట్లో ఉంటూ క్యాటరింగ్ పనులు చేసుకుని జీవిస్తోంది. ఈ నెల 7న మొక్కు తీర్చుకునేందుకు తన స్కూటీపై ఒంగోలు వెళ్ళి తిరిగి వస్తుండగా, నూతన బైపాస్ రోడ్డుపై నాదెండ్ల అండర్‌పాస్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. గాయాలైన నాగమణిని 108 సాయంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరి శిరీష ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘనంగా ఆలయ ప్రతిష్ఠామహోత్సవం

రొంపిచర్ల : మండల కేంద్రంలో శనివారం నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయంలో శ్రీ అంకమ్మతల్లి, శ్రీ పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన ఆలయ, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా సాగింది. ఆడపడుచులు గ్రామంలో తమ పుట్టిళ్ళకు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. పుట్టిళ్ళకు వచ్చిన ఆడపడుచులకు తమ సోదరులు నూతన వస్త్రములు బహుకరించారు. అదే విధంగా ఆనవాయితీగా ఆడపడుచులు కూడా తమ సోదరులకు నూతన వస్త్రములు బహుకరించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రివేళ ఆలయంలో భజనా కార్యక్రమం నిర్వహించారు.


ఆలయానికి వచ్చిన డాక్టర్ గోపిరెడ్డికి స్వాగతం పలికిన గ్రామస్తులు

చలివేంద్రం ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్

మాచర్ల రూరల్: అధిక ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో మాచర్లలో నమోదవుతాయి. పట్టణానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం, మజ్జిగ అందించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎవరూ అమలు చేయడం లేదు. ఏప్రిల్ ప్రారంభమైన పురపాలక, పంచాయితీ పరిధిలో ఏర్పాటు చేయటంలో అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. ఈ సమస్యపై సాక్షిలో కథనం రావడంలో అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో ఎట్టకేలకు పట్టణంలో చలివేంద్రం ప్రారంభించారు. రెండు ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గురజాల రూరల్: ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కర్రలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దాడిలో ఇరువర్గాల్లో అటువైపు ఇరువురికి, ఇటువైపు ఇరువురికి గాయాలు అయ్యాయి. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి

నరసరావుపేట రూరల్: కేతముక్కల అగ్రహారంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.23 వేల నగదు, 19 మోటర్ సైకిల్స్, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు మండలంలోని కేతముక్కల అగ్రహారం శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఎస్ఐ కిషోర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్న 18 మందితో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో ఫెండ్లీ క్రికెట్ పోటీలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆర్గనైజర్ కుంభా వెంకట్రావు శనివారం తెలిపారు. సెమీ ఫైనల్‌కి నాగవరం, గణపవరం, రెడ్డిగూడెం 1, 2 టీమ్‌లు వచ్చాయి. కమిటీ సభ్యులుగా ఎస్‌కె బాషా, ఫార్క్, మహేష్, రసూల్, సరాఉద్దీన్ అజయ్ తదితరులు వ్యవహరిస్తున్నారు.

వైభవంగా అచ్చమాంబ తిరునాళ్ల

సత్తెనపల్లి: మండల పరిధిలోని గుడిపూడి, నందిగామ గ్రామాల్లో అచ్చమాంబ, పుల్లయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. తిరుణాళ్లను పురస్కరించుకొని ప్రభలు కట్టారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నాటుసారా సామగ్రి ధ్వంసం

అచ్చంపేట: మండలంలోని జడపల్లి తండా సరిహద్దులో గల కృష్ణానది ఒడ్డున నాటుసారా తయారీ కేంద్రాలపై క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, నరసరావుపేట ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. తయారీకి వినియోగించే 600లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తయారీదారుడైన జడపల్లి మోటు తండాకు చెందిన మూడవత్ చిన్నకొండనాయక్ పారిపోయినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి చెప్పారు. బెల్లపు ఊటను ధ్వంసం చేసి డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



అంకితభావంతో పార్టీని బలోపేతం చేయాలి

రెంటచింతల: మండలంలోని నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి నూతన మండల కమిటీ అంకితభావంతో కృషి చేయాలని పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల నూతన కమిటీ అధ్యక్షుడి ఎంపికైౖ గొట్టం చిన బ్రహ్మారెడ్డి, సభ్యులు శనివారం పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హులైన లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాలను అందజేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరిట పేద ప్రజలందరినీ మోసం చేసిన విషయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపి, పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి కేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎన్.భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు పి.సంపూర్ణమ్మ, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చల్లా మట్టారెడ్డి, ఏరువ శౌర్రెడ్డి, శీలం అంజయ్య, కె.మర్రెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, మేకపోతుల శివారెడ్డి, మున్నా చంద్రం, పి.చంద్రారెడ్డి, ఎ.వెంకటేశ్వరరెడ్డి తదితరులున్నారు.


కేక్ కట్‌చేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి

మాచర్ల రూరల్: రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, మతోన్మాద బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలందరూ ఏకం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదరావు కోరారు. శనివారం పట్టణంలోని సీపీఐ కొమెర వీరస్వామి భవనంలో జరిగిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సీట్లు, ఓట్లు కోసం అలివికాని హామీలిచ్చి అమలు చేయడంలో చిత్తశుద్ధి లేని మోదీ మతతత్వవాదాన్ని ప్రజల పై మోపుతున్నారన్నారు. మోదీ బడా పారిశ్రామిక వేత్తలకు దోచిపెడుతూ మధ్య తరగతి కుటుంబాల నడ్డి విరుస్తున్నారన్నారు. కార్మికుల సంక్షేమానికి దేశవ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పాల్సిన ఆయన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. విభజన హామీలో భాగమైన ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఎందుకివ్వటం లేదని ఆయన ప్రశ్నించారు. జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారాయని, సామాన్యులకు సంస్కరణల పేరుతో వారి నడ్డి విరుస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు చట్ట సవరణ తో మైనారీలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కార్యదర్శులు మిద్దెపోగు బాబురావు, కేతావత్ రంగనాయకులు, కాలా శివయ్య, షేక్ సైదా, నర్రా రంగస్వామి, సిహెచ్ రామయోగి, ఎస్ లక్ష్మయ్య, అమరేశ్వరరావు, వేముల గరటయ్యల పాల్గొనగా అనంతరం వక్ఫ్ బోర్డు బిల్లుల పత్రాలను దహనం చేశారు.


వక్ఫ్ చట్టం సవరణ బిల్లును దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

ఉన్నత చదువులపై అవగాహన

రాజుపాలెం: పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు పై చదువులపై పద సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.యోహాన్‌రాజు శనివారం అవగాహన కల్పించారు. ట్రైనర్ ఎం దీన అంబేడ్కర్ మాట్లాడుతూ ఏ కోర్సులు చదివితే ఎలాంటి జాబ్‌లు వస్తాయో వివరించారు. కార్యక్రమంలో సమర్థన ట్రస్ట్ మొబిలైజర్ శ్రీనివాసరావు, సురేంద్ర, లాయర్ ఎస్ వీరయ్య పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిశుభ్రతకు ప్రాధాన్యం

సత్తెనపల్లి: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సిల్ట్ తొలగింపు కార్యక్రమం చేపట్టామని మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ అన్నారు. సిల్ట్ తొలగింపు పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. అక్కడి సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.


సిల్ట్ తొలగింపును పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ సుమన్ కుమార్

ఘనంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని అలవాల అచ్చయ్యపాలెం శివారు మృత్యుంజయపురంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి తిరునాళ్లను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆరేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల కూడా నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రత్యేక భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రొంపిచర్ల పోలీసులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.



సొసైటీ సేవలు అభినందనీయం

ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు

శావల్యాపురం: సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సారథ్యంలో వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రం శావల్యాపురం ప్రధాన కూడలి మార్గం గుంటూరు-కర్నూలు రహదారి వెంబడి ఏర్పాటు చేసి న చలివేంద్రాన్ని ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు మాట్లాడుతూ గత 16 సంవత్సరాల నుంచి నిర్విరామంగా స్వచ్ఛందంగా వేసవికాలం రెండు నెలల పాటు మట్టి కుండల్లో చల్లటి నీరు పోసి ప్రజల దాహార్తి తీర్చటం సొసైటీ సేవలకు నిదర్శమన్నారు. ప్రతి ఏడాది వేసవికాలంలో అడవి పేరంటాళ్ళమ్మ తిరునాళ్ల వేడుకల్లో అమ్మవారిని దర్శించుకునే భక్తులకు కూడా సైతం కూలింగ్ వాటర్ వితరణ చేయటం అభినందనీయమన్నారు. సొసైటీ కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చందు మాట్లాడుతూ వారంలో ప్రతి బుధ వారం ప్రత్యేకంగా మజ్జిగ కూడా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మతుకుమల్లి గ్రామ మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు, ఏసురాజు, కాకాని నారాయణరావు, గణపర్తి వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

